# దళారుల చేతిలో అరటి రైతు విలవిల

- రెండు నెలల వరకూ అప్పు..
- రూ.లక్షల్లో డబ్బు ఎగ్గొడుతున్న దళారులు


మార్కెట్‌కు తరలించేందుకు ఐచర్ వాహనంలో లోడ్ చేసిన అరటి కాయలు

**తాడిపత్రి రూరల్:** అరటి రైతుల కష్టాన్ని దళారులు నిలువునా దోచుకుంటున్నారు. మార్కెట్‌పై అవగాహన లేక రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులపై ఆధారపడుతున్నారు. దీన్ని అవకాశంగా చేసుకుంటున్న కొందరు రైతుల జీవితాలతో చెలగాట మాడుతున్నారు. రైతుల కంటే దళారులకే ఎక్కువ లాభాలు ఉండటంతో.. అరటి సాగు చేసే గ్రామాల్లో పుట్టగొడుగుల్లా దళారులు పుట్టుకొస్తున్నారు. రైతుల నుంచి అరటి కాయలు కొనుగోలు చేసిన వారు డబ్బు కోసం రెండు నెలల డెడ్‌లైన్ విధిస్తున్నారు. గతంలో దళారుల మాటలు నమ్మి లక్షలాది రూపాయల విలువైన సరుకును అప్పు రూపంలో విక్రయించిన రైతులకు కుచ్చటోపి పెట్టిన సందర్భాలు ఉన్నాయి. కొందరు అరకొర మొత్తాలను రైతులకు ఇచ్చి మిగిలిన మొత్తాలను స్వాహా చేసి పరారైన సందర్భాలున్నాయి. తాడిపత్రి ప్రాంతం నుంచి ఎక్కువగా అరటిని దళారులు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, కోల్‌కత్తా, శ్రీనగర్ తదితర నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. అక్కడి వ్యాపారులతో రైతులకు ఎలాంటి సంబంధం ఉండదు. దళారులకు వారు ఎంత డబ్బు ముట్టజెప్పింది వీరికి తెలియదు.

**12018 ఎకరాల్లో అరటి సాగు**

తాడిపత్రి ప్రాంతంలోని ఆయా మండలాల్లో దాదాపు 10వేల హెక్టార్లల్లో అరటి సాగులో ఉంది. అరటి రైతులు మూడు దఫాలుగా పంట దిగుబడి తీసుకుంటారు. ప్రస్తుతం మొదటి పంట టన్ను రూ.18 నుంచి 22 వేలు, రెండో పంట రూ.10 వేల నుంచి 14 వేలు, మూడో పంట రూ.10వేల లోపు ధర పలుకుతోంది. ఎకరాకు మొదటి పంటకు రూ.2.25 లక్షలు, రెండవ పంట రూ.70 వేల నుంచి 1.20 లక్షలు, మూడో పంటకు రూ.50 వేలు ఖర్చు చేయనున్నారు. అంచనాల మేరకు పంట దిగుబడి వస్తే ఎకరాకు మొదటి పంటకు 20- 22 టన్నులు, రెండో పంట 16 -17 టన్నులు, మూడో పంట 10-12 టన్నుల వరకూ వస్తుంది. కాగా అర్టి పంట ద్వారా పలువురు కూలీలకు ఉపాధి లభిస్తోంది. మూడున్నర టన్నుల ఐచర్ వాహనానికి గెలల నుంచి అరటి కాయలను వేరుచేసి లోడ్ చేస్తే రూ.3 వేలు కూలీ ఇస్తారు. కూలీల సంఖ్యను బట్టి లోడ్‌కు ఒక్కొక్కరికి రూ.450 దాకా గిట్టుబాటు అవుతోంది.


గెలను మోసుకువస్తున్న కూలీ

**అరటి సాగు ఇలా**

| మండలం | ఎకరాలు |
|---|---|
| పుట్లూరు | 5,450 |
| యల్లనూరు | 3,572 |
| పెద్దపప్పూరు | 2,860 |
| తాడిపత్రి | 136 |

**14 ఎకరాల్లో అరటి సాగు చేశా**



14 ఎకరాల్లో అరటి పంటను సాగు చేశా. ఎకరాకు రూ.2.25 లక్షలు పెట్టుబడి పెట్టా. ధరల్లో నిలకడ ఉంటే లాభాలు ఉంటాయి. అరటిని కొనుగోలు చేసిన వ్యాపారులు డబ్బు ఇవ్వడానికి రెండు నెలలు పడుతోంది. పెట్టుబడికి తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయి. ఎరువులు, మందుల ధరలు పెరిగాయి.

– రామాంజులరెడ్డి, రైతు, రంగరాజుకుంట

**అందరూ అలా ఉండరు**



రైతుల నుంచి కొనుగోలు చేసిన అరటి కాయలను వివిధ మార్కెట్లలోని వ్యాపారులకు విక్రయిస్తుంటాం. కొందరు వ్యాపారులు చెప్పిన సమయానికి మొత్తం డబ్బులు ఇస్తారు. మరికొందరు వివిధ కారణాల పేరుతో జాప్యం చేస్తుంటారు. కొంత మొత్తం ఇచ్చి సమయం పెడుతుంటారు.

– వ్యాపారి, రామాంజనేయులు

**రూ.450 కూలి వస్తోంది**



ఐచర్ వాహనానికి అరటి కాయలను లోడ్ చేస్తే ఒక్కొక్కరికి రూ.450ల చొప్పున కూలి వస్తోంది. కూలీల డిమాండ్‌ను బట్టి ఎక్కువ కూలి వస్తుంది. వ్యవసాయ పనులు లేని సమయంలో అరటి కాయల లోడ్ ఉపాధినిస్తోంది. కొన్ని సమయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో కూడా కాయల లోడ్ ఎత్తుతుంటాం.

– ప్రమీలమ్మ, కూలి, రంగరాజుకుంట

## క్లుప్తంగా

### ఘనంగా పూర్వాభాద్ర హోమం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

**గుంతకల్లు రూరల్:** కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఆదివారం పూర్వాభాద్ర హోమం ఘనంగా నిర్వహించారు. అనంతరం పుష్యార్క హోమం చేశారు. ఈ సందర్భంగా ఆలయ యాగశాలలో స్వామి ఉత్సవ మూర్తికి ముందుగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు వేద పండితులు, అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

### కిశోర వికాసంపై నేడు అవగాహన

**గార్లదిన్నె:** మండల కేంద్రంలోని ఆర్బీకేలో సోమవారం కిశోర బాలిక వికాస్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ వాణి తెలిపారు ఆదివారం ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు,రెవెన్యూ అధికారులకు కిశోర వికాసంపై ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. సదస్సుకు అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

### చర్చిలలో ఆరాధనోత్సవం


సీఎస్ఐ చర్చిలో పిల్లలకు బహుమతి ప్రదానోత్సవ దృశ్యం

**పామిడి:** మండలంలోని అన్ని చర్చిల్లో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో దైవదాసులు పీవీఎస్ రాజు క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. పాపులను రక్షించుటకు క్రీస్తుఏసు ఈ లోకానికి వచ్చారన్నారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడు మన జీవితాలు ధన్యకరమవుతాయన్నారు. అనంతరం ఇల్లూరు మెర్సీరాజు దంపతుల సౌజన్యంతో సెమీ క్రిస్మస్, క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల్లో చిన్నారుల నాటక, సాంస్కృతిక ప్రదర్శనలకు గాను సంఘ పెద్దలచే బహుమతులతో ప్రోత్సహించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### అయోడిన్ ఉప్పుతో ప్రయోజనం


తరిమెలలో అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

**శింగనమల:** అయోడిన్ లోపం వల్ల పలు అనారోగ్య సమస్యలు వస్తాయని, ప్రతి ఒక్కరూ అయోడిన్ ఉప్పు మాత్రమే వాడాలని ఐజీడీ జిల్లా కోఆర్డినేటర్ దురగయ్య సూచించారు. ఆదివారం మండలంలోని తరిమెలలో శింగనమల ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్మార్ట్ ఆశీర్వాద్ ప్రాజెక్ట్‌లో భాగంగా కళాజాతా బృందం అయోడిన్ ఉప్పు వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబిలేసు, ఐజీడీ సిబ్బంది సుదర్శన్ రెడ్డి, మహమ్మద్ రహీనా, పోతులయ్య, రమణమ్మ, కళా బృందం సభ్యులు తరిమెల రాజు, తిప్పయ్య, స్వామి, బాలు, నిర్మల, సరోజ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మద్యం విక్రేత అరెస్టు

**యాడికి:** మండల కేంద్రంలోని చౌడేశ్వరీ కాలనీలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న చింత కేశవ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. నిందితుడి నుంచి 180 మి.లీ. పరిమాణమున్న 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమణ, ఏఎస్ఐ వెంకటేస్, పోలీసులు పాల్గొన్నారు.

### రామకృష్ణారెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం


రామకృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

**గుంతకల్లుటౌన్:** పేద ప్రజలు, కార్మిక, కర్షకుల కోసం అనేక పోరాటాలు నిర్వహించిన సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నేత రామకృష్ణారెడ్డి ఆశయాల కొనసాగిద్దామని ఐఎఫ్‌టీయూ కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, డివిజన్ కార్యదర్శి బి.సురేష్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రామకృష్ణారెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా.. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. పార్టీ నాయకులు రఘునాథరెడ్డి, జిలాన్, దావీద్, హనుమంతు, రఘు, బాషా తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యం ఏర్పరుచుకుని చదవాలి


విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

**గుత్తి రూరల్:** పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు అయ్యేందుకు విద్యార్థులు ఓ లక్ష్యం ఏర్పరుచుకొని చదవాలని గుత్తి ఏఎస్‌డబ్ల్యూఓ రాధిక సూచించారు. ఆదివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గుత్తి డివిజన్ పరిధిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉండే పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమయం తక్కువగా ఉందని, ప్రతి విద్యార్థి ప్రణాళిక ఏర్పరుచుకుని చదవాలన్నారు. రోజూ 10 నుంచి 14 గంటల పాటు చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

**తాడిపత్రి రూరల్:** మండలంలోని బ్రహ్మణపల్లిలో టీడీపీకి చెందిన ఐదుగురు రౌడీ షీటర్లకు ఆదివారం స్టేషన్‌కు పిలిపించి అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ఉండాలని హెచ్చరించారు. పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠినచర్యలు తీసుకోవడంతోపాటు కేసు నమోదు చేస్తామన్నారు. బ్రహ్మణపల్లి గ్రామంలో వరుసగా జరుగుతున్న సంఘటనలకు దృష్టిలో ఉంచుకొని గ్రామంలో పోలీసు బందోబస్తును కొనసాగిస్తున్నారు.

## దివ్యాంగులకు నిత్యావసరాలు

**తాడిపత్రి అర్బన్:** పట్టణంలోని రోటరీ క్లబ్ కార్యాలయంలో సుమారు 501 మంది దివ్యాంగులకు రూ.500 విలువ చేసే నిత్యావసర సరుకులను ఆ క్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ప్రతి నెలా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బాలసుబ్రమణ్యం, రహీం, రామయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## జూదకేంద్రంపై పోలీసుల దాడి

**యల్లనూరు:** మండలంలోని బుక్కాపురంలో నిర్వహిస్తున్న జూద కేంద్రంపై పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా ఐదుగురు పేకాటరాయుళ్లతో పాటు రూ. 5,500 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## గుండెపోటుతో కండక్టర్ మృతి


మృతుడు బంగారు నాయుడు

**గుత్తి:** విధి నిర్వహణలో ఉన్న కండక్టర్ గుండెపోటుకు గురై మృతి చెందాడు. వివరాలు... గార్లదిన్నె మండలం కేశవపురం గ్రామానికి చెందిన బంగారునాయుడు (57) గుత్తి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం విధుల్లో పాల్గొన్న ఆయన గుత్తి నుంచి తొలుత అనంతపురానికి ప్రయాణికులను చేరవేశాడు. అనంతరం అక్కడి నుంచి ప్రయాణికులను ఎక్కించుకుని కర్నూలుకు వెళుతుండగా మార్గమధ్యంలో ప్యాపిలి వద్దకు చేరుకోగానే ఛాతీలో నొప్పి అంటూ బస్సులోనే కుప్పకూలాడు. డ్రైవర్ అప్రమత్తమై వెంటనే బస్సును వెనక్కు మళ్లించి గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి చేర్చాడు. వైద్యుల సూచన మేరకు ప్రైవేట్ వాహనంలో అనంతపురానికి తరలిస్తుండగా టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగానే పరిస్థితి విషమించింది.దీంతో వాహనాన్ని వెనక్కు మళ్లించి గుత్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బంగారు నాయుడు మృతిచెందినట్లు నిర్ధారించారు.

## తాడిపత్రిలో దొంగల హల్‌చల్

**తాడిపత్రి టౌన్:** స్థానిక సుంకులమ్మ పాలెంలో శనివారం అర్ధరాత్రి వరుసగా 5 ఇళ్లలో దొంగలు పడ్డారు. అయితే కాలనీలోని ఓ పెంట్ హౌస్‌లో మాత్రమే విలువైన వస్తువులు చోరీ అయ్యాయి. అన్ని ఇళ్ల తలుపులకు వేసిన తాళాలు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు... ఆయా ఇళ్లలో ఎలాంటి డబ్బు, నగలు లభ్యంకాకపోవడంతో వెనుదిరిగారు. కాగా, విలువైన సొత్తు ఏదీ పోకపోవడంతో చోరీ యత్నం జరిగిన ఇళ్ల, పెంట్‌హౌస్ యజమాని ఫిర్యాదు చేయడానికి ముందుకు రాలేదు. అయినా విషయం తెలుసుకున్న ఎస్ఐ గౌస్‌బాషా ఆదివారం ఉదయం ఆయా ఇళ్లను పరిశీలించి, సుమోటోగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## గుత్తి కోట సంరక్షణకు తోడ్పడండి


గుత్తి కోట క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

**పెద్దవడుగూరు:** గుత్తి కోటను సంరక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపకుడు విజయభాస్కర్, అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో 2025 క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిరుమల, రామాంజనేయులు, రహంతుల్లా, వెంకటరెడ్డి, సీపీఐ నాయకులు నారాయణ, సూర్యనారాయణరెడ్డి, గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

**గుత్తి కోట క్యాలెండర్ల ఆవిష్కరణ**

**గుత్తి:** పట్టణంలోని అమృత్ సినిమా థియేటర్‌లో ఆదివారం గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ ఆధ్వర్యంలో 2025 సంవత్సరం గుత్తి కోట క్యాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అమృత్ సినిమా థియేటర్ మేనేజర్ మర్తాడు దాదా ఖలందర్, శ్రీకరం గోవిందరాజులు, ఓబుళపతి, ఆర్‌బీ కృష్ణమూర్తి, జీవు బాషా, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తి పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో ఆదివారం జేవీవీ క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, మండల అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా నాయకులు రమేష్, దేశాయి నాగరాజు, సుధాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### బస్సు ఢీ .. వృద్ధురాలికి గాయాలు

**గుత్తి:** స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం ఉదయం రోడ్డు దాటుతున్న గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు నాగమ్మ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

### ఇద్దరిపై కేసు నమోదు

**గార్లదిన్నె:** మండలంలోని పి.కొత్తపల్లిలో భూ తగాదా విషయంలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. ఆదివారం ఎస్ఐ మాట్లాడుతూ కనంపల్లికి చెందిన మాళవికకు పి.కొత్తపల్లిలో కొంత భూమి ఉందన్నారు. డిసెంబర్ 24న క్రిష్ణ , శ్రావంత్ భూమి విషయమై ఘర్షణ పడి దాడి చేసినట్లు మాళవికపై ఫిర్యాదు చేయడంతో.. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## సెంట్రల్ జోన్ పోటీల్లో ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

**బుక్కరాయసముద్రం:** అండర్-15 ఉమ్మడి అనంతపురం జిల్లా సెంట్రల్ లెవల్ ఆర్టీటీ జూడో చాంపియన్ షిప్ పోటీలలో బీకేఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. అండర్ -15 ఉమ్మడి అనంతపురం జిల్లా సెంట్రల్ లెవల్ ఆర్డీటీ జూడో చాంపియన్ షిప్ పోటీలు జనవరి-4, 5న ఆలమూరు రోడ్డు లోని గుడ్ చిల్డ్రన్ స్కూల్‌లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో ధర్మవరం జోన్ నుంచి బీకేఎస్ క్లబ్ జూడో 9 మంది విద్యార్థులు సెంట్రల్ జోన్‌లో అత్యంత ప్రతిభ కనబరిచారన్నారు. పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ ద్వితీయ స్థానం సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్‌లో క్రీడాకారులు మరింత ఉన్నతంగా రాణించాలని వారు ఆకాంక్షించారు.

## కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణా

- రూ.130 ఫైన్‌తో ఇటాచీని వదిలిన పోలీసులు

**పామిడి:** ఇసుక అక్రమ రవాణా దందాలో పట్టుబడిన ఓ ఇటాచీకి పోలీసులు రూ.130 వేసి వదిలేయడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాలు.. పామిడి సవీసీసమీపంలోని పెన్నానదిలో అక్రమంగా ఇసుకను తోడేస్తూ ట్రిప్పర్లతో నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో అక్రమ దందాకు మళ్లీ తెరలేపారు. గత కొన్ని రోజుల నుంచి ఆ ప్రజాప్రతినిధి అండదండలతో గుంతకల్లుకు చెందిన ఓ తెలుగుతమ్ముడు ఇసుక అక్రమ తరలింపు చేపట్టాడు. సంబంధిత మైనింగ్, విజిలిలెన్స్, రెవెన్యూ, పోలీసుశాఖాధికారులు అటువైపు కన్నెత్తి చూడక పోవడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం పామిడి పెన్నానది నుంచి ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణా సాగుతుందన్న సమాచారం అందుకున్న సీఐ వీ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు పెన్నానదిలో అక్రమ ఇసుక రవాణా స్థావరంపై దాడి చేసి 9 ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్న వైనం పాఠకులకు తెలిసిందే. ఈక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో గుంతకల్లు తెలుగు తమ్ముడు ఇటాచీతో అక్రమంగా పెన్నానది నుంచి ట్రిప్పర్లతో తరలిస్తున్న సమాచారాన్ని పట్టుబడ్డ ట్రాక్టర్ నిర్వాహకులు పోలీసులకు తెలిపారు. ఆ ఇటాచీని స్వాధీనం చేసుకోకపోతే 100కు డయల్ చేస్తామని పట్టుబడ్డ ట్రాక్టర్ల నిర్వాహకులు స్థానిక పోలీసులకు తెలిపారు. దీంతో అప్రమత్తమైన సీఐ ఆధ్వర్యంలో పోలీసులు హుటాహుటినా పెన్నానదిలో అక్రమంగా ఇసుకను తోడేస్తున్న ఇటాచీని స్వాధీనం చేసుకున్నారు. దాన్ని లారీలో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇంతవరకూ సీన్ బాగున్నా..వారు స్వాధీనం చేసుకున్న ఇటాచీని కొన్ని గంటల వ్యవధిలోనే రూ.130 అపరాధ రుసుం విధించి వదిలేయడం వెనుక పోలీసుల ఆంతర్యంపై ప్రజలు గుసగులలాడుతున్నారు. ఒక అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టుబడితేనే... దాన్ని రిలీజ్ చేసుకోవడం ఎంతో తతంగం. అలాంటిది ఇటాచీని కేవలం రూ.130లు ఫైన్‌తో పోలీసులు వదిలివేయడంపై పామిడిలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## అనంత వెంకటరెడ్డికి ఘన నివాళి


ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి తదితరులు

**బుక్కరాయసముద్రం:** అనంతపురం మాజీ ఎంపీ, దివంగత అనంత వెంకటరెడ్డి జిల్లాకు చేసిన సేవలు మరువ లేనివి అని అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రోటరీపురంలో ఉన్న అనంత వెంకటరామిరెడ్డి తోటలో అనంత వెంకటరెడ్డి 25వ వర్ధంతి కార్యక్రమం ఆయన కుమారులు అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, అనంత చంద్రారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరెడ్డి ఘాట్ వద్ద ప్రముఖులు పుష్ప గుచ్ఛాలతో నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ అనంతపురం జిల్లా అభివృద్ధికి అనంత వెంకటరెడ్డి ఎంతో కృషి చేశారని కొనియాడారు. రైతాంగానికి సాగు, తాగునీరు తీసుకురావడానికి ఎంతో కృషి చేశారన్నారు. అనంత వెంకటరెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, నగర మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్ర రెడ్డి, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, ఓబిరెడ్డి, నరసింహులు, శ్రీనివాస్‌రెడ్డి, సైపుల్లాబేగ్, చంద్రశేఖర్ యాదవ్, అమర్‌నాథ్ రెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి, అశ్వర్థనాయక్, అనిల్‌కుమార్‌గౌడ్, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, గౌస్‌బేగ్, రాధాకృష్ణ, చిత్రా వెంకటేష్, జానీ, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.


ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

### బైక్ బోల్తా.. వ్యక్తికి గాయాలు

**గుత్తి రూరల్:** మండలంలోని తురకపల్లి శివారులో ఆదివారం కుక్క అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడి వెంకటేష్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు. తురకపల్లికి చెందిన వెంకటేష్ పని నిమిత్తం గుత్తికి వచ్చాడు. అనంతరం గ్రామానికి వెళ్తుండగా గ్రామ శివారులో రోడ్డు పైకి ఒక్కసారిగా కుక్క రావడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్ర గాయాలతో పడి ఉన్న వెంకటేష్‌ను స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం బంధువులు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



### శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

**గార్లదిన్నె:** శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గౌస్ మహమ్మద్‌బాషా హెచ్చరించారు.ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కల్లూరు, మర్తాడుకు చెం దిన 12 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సాహించినా చర్యలు తీసుకుంటామన్నారు.గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించే వారిపై నిఘా ఉంచామన్నారు.అలాగే సత్ప్రవర్తన కలిగి ఉన్న వారిపై రౌడీషీటర్లు తొలగించడానికి ఉన్న తాధికారులకు నివేదిస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లుపై పీడీ యాక్టు ప్రయోగిస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

### ముగ్గురిపై కేసు నమోదు

**తాడిపత్రి రూరల్:** పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డులో శనివారం డ్రంకన్ డ్రైవ్ కింద ముగ్గురిపై కేసు నమోదు చేశామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఐశ్వర్య విల్లాస్ బైపాస్ రోడ్డులో మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న నారాయణరెడ్డి, జానీ, మహమ్మద్ రఫీని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామన్నారు. అలాగే పట్టణ సమీపంలోని కడప రోడ్డులో వాహనాలు తనిఖీ చేసి రికార్డులు లేని 12 వాహనాలకు రూ.2,250 జరిమానా విధించామన్నారు.